# అపోహ

## శ్రీ మెట్టా వెంకటేశ్వరరావు

శ్రీరామ్మూర్తీ జగ్గయ్యా అయిదారేళ్ళ యీడు నుంచీ స్నేహితులు. ఇద్దరూ ఒక వ్యాపారంలో భాగస్వాముల్లాగా గోలీకాయలాడుకునే రోజుల్లో కూడా గెల్చుకున్నవి ఒక సంచీలో పోసుకుని వాటిని కానీలకీ అర్ధణాలకీ అమ్మి వచ్చిన డబ్బులతో యేమైనా కొనుక్కుని ఇద్దరూ చెరికాస్తా తినేవాళ్లు. జగ్గయ్య తండ్రి రెండెకరాల ఆసామీ; ఎలాగో వెళ్ళదోస్తున్నాడు కాలాన్ని. మూర్తి తాత మొదట్లో ఏమీ లేనివాడే అయినా మహా తెలివిగలవాడు. సమయం కని పెట్టి కమీషన్ వ్యాపారం ప్రారంభించాడు. అవి పిచ్చిరోజులు; 'అరవ మోవ్యం ఇరవై ఒకటి' పద్ధతిలో కొలిచి రైతుల్ని మోసంచేసి సంపాదించాడు. తర్వాత పసుపు వ్యాపారంలో వేలకి వేలు సంపాదించాడు. ఎన్ని రకాల డబ్బు సంపాదించటానికి వీలౌతుందో అన్ని రకాలా సంపాదించి వందెకరాల ఆసామీగా చచ్చిపోయాడు. ఆయన కొడుకు రామస్వామి మహాభోగి; నాటకాలూ భోగం కొంపలూ; వేషం వెయ్యటానికివచ్చి కిరాయి డబ్బులమాట ఎలా ఉన్నా పట్టుచీర కట్టుకుపోని భోగంది లేదు. ఎలాగైతేనేం నలభైయేళ్లొచ్చేసరికి బాకీలవాళ్లు దయదల్చి వదిలిపెట్టిన కొంప తప్పితే వేరె దమ్మిడీ ఆస్తి లేకుండా చేశాడు. తను వచ్చినపని పూర్తయినట్టు మరో నాలుగేళ్ళకు ఈ లోకం వదలి పెట్టేడు. అతను చనిపోయేటప్పటికి మూర్తి ఎనిమిదేళ్లవాడు ఇప్పుడు పదిహేనేళ్ళు. స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇల్లూ దాంట్లోవున్న చిల్లర వస్తువులూ అమ్ముకుంటూ, బాగా ఉన్నరోజుల్లో దగ్గర జేరి కాజేసినవాళ్ళెవున్నా కృతజ్ఞత ఉండి ఇస్తే దాంతో ఇంతకాలమూ కాలక్షేపం చేస్తూ వస్తున్నారు.

మూర్తికీ జగ్గయ్యకీ చిన్నప్పట్నుంచీ స్నేహం. ఇద్దరూ కలిసి ఫోర్తుఫారందాకా పొరుగూరి హైస్కూల్లో చదివేరు. ఆ క్లాసు జగ్గయ్య తప్పేడు. తండ్రి చావకొట్టేడు. చదువుకునే రోజుల్లో పుస్తకాలకని తండ్రి నడిగీ లేకపోతే తల్లిని బ్రతిమాలీ యివ్వకపోతే పెరుగూ పాలూ అమ్మి గూళ్ళల్లోనో తిరగమోత పెట్టెల్లోనో దాచినవి కాజేస్తూ అవీ దొరక్కపోతే చాటుగా కోమటింటికి బియ్యం చేరబోస్తూ యేదోవిధంగా డబ్బులు సంపాదించి మూర్తి క్కావలసిన పుస్తకాలు కూడా తనే కొనేవాడు. క్లాసు పుస్తకాలు ఇద్దరిదగ్గరా చెరిసగ ముండేవి. నోట్సులు మూర్తే వ్రాసేవాడు. తాను బెంచెక్కేవాడు. ఇద్దరూ కలిసి చదువుకునేవాళ్లు. మూర్తి చదువుతూంటే తను పడుకుని వింటూండేవాడు. మధ్యలో తెలియకుండానే నిద్రపోయేవాడు. పాపం యెలాగోలా మూడవ ఫారందాకా నెట్టేశాడు. పైన చేతకాలేదు. నాలుగవ ఫారం తప్పితే తండ్రి చావకొట్టేడు. ఇక చెప్పించ నన్నాడు. నే నసలు చదవ నన్నాడు తను. అంతే—తీరా మళ్ళీ బడి తెరిచిన తర్వాత వెళ్లమని తండ్రెన్నిసార్లు కొట్టినా హరిశ్చంద్రుడల్లే మాట నిలబెట్టుకొన్నాడు.

అయితే చదువు మానినంతమాత్రాన వాళ్ళ స్నేహం వీసంకూడా తగ్గలేదు. జగ్గయ్య పొలం వెళ్లి సాయంత్రం నాలుగ్గంటలకల్లా గేదెలకి గడ్డికోసుకొచ్చి పడేసి పొరుగూరి హైస్కూలునుంచి వచ్చే మూర్తికి యెదురుపోయేవాడు. సగం దార్లో యిద్దరూ కలుసుకునేవాళ్ళు. ఊళ్లోకి వచ్చి కాలవ గట్టుమీద నే కాసేపు చెడుగుడు ఆడుకుని యింటికి పోయి స్నానం చేసి భోంచేసేవాళ్ళు. జగ్గయ్య మెల్లిగా తండ్రి విస్తరిముందు కూర్చోగానే బయలుదేరి దార్లో కొట్లో ఒక కానీ బీడీలు కొనుక్కుని మూర్తి యింటికి వెళ్లి—వాళ్లమ్మ కూడా యింట్లో అన్నం తింటూ ఉంటుంది గాబట్టి నిర్భయంగా మూర్తి చదువుకునే లాంతరులో బీడీ ముట్టించుకుని—అది అయిపోయే దాకా మాట్లాడుకుని తిరిగి యింటికి వెళ్ళిపోయే వాడు. కాస్త యింట్లోనూ పొలానా పనిజేస్తున్నాడు గాబట్టి జగ్గయ్యకి తల్లి ఒక కిస్తీలో యిచ్చే డబ్బు అణాలూ బేడలనుంచీ అర్ధరూపాయకి హెచ్చింది.

* ఆంధ్రవిశ్వకళాపరిషత్ ఆంధ్రభాషాసమితి పోటీ (1953) ప్రథమ బహుమతికథ

మూర్తికి పుస్తకం కావాల్సొచ్చినప్పుడల్లా జగ్గయ్య తల్లికి తాఖీదు చేరేది. దాన్ని ఖాతరు చెయ్యక పోతే తిరగమూత పెట్టెకి పోదా. అది తృప్తి పరచక పోతే బియ్యపుడబ్బాకి మూడుతుంది. కొద్దికొద్ది అవసరాల నెలాగో యీ పద్ధతులతో జగ్గయ్య సంబాళించుకు నేవాడు.

కాని యిప్పుడు పెద్ద చిక్కొచ్చిపడింది. మూర్తి స్కూలు ఫైనల్ పరీక్ష ఫీజు పదిహేను రూపాయ లొక్కసారిగా కట్టవలసి వచ్చింది. బీద విద్యార్థి అని జీతం తగ్గించారేగాని పరీక్ష ఫీజు తగ్గిస్తారా? మూర్తి తల్లి యెన్నిచోట్లనో ప్రయత్నించింది. ఎవరిస్తారు. క్రొత్తగా అయితే యెవరన్నా యిస్తారు పదేళ్ళబట్టీ మామూలేనాయె. అందరి హృదయాల్లో దయకికూడా కాలదోషం పట్టింది. వారు వీర్నీ వీరు వార్నీ అడగమన్నారు. ఎంత ప్రయత్నించినా పదికంటే దొరకలేదు. పదిహేనవ తారీఖు రేపు, ఫీజు కట్టటానికి ఆఖరురోజు. ఆరోజు సాయంత్రం మూర్తి దిగాలుగా ఉన్నాడు. మామూలు ప్రకారమే జగ్గయ్య అతన్ని కలుసుకున్నాడు. విషయం తెలుసుకున్నాడు. 'మాద్దాంలే' అన్నాడు. ఎవరికివాళ్లు వెళ్ళిపోయారు.

అయిదురూపాయిలు—ఒక్కసారిగా. మూర్తి పొరపాటుచేశాడు. కొద్దిరోజుల క్రితం చెప్పి ఉన్నట్టయితే కొన్ని కిస్తీలలో సంతరించేవాడు. ఒక్క తడవంలో కావాల్సొచ్చేటప్పటికి ఇబ్బంది పట్టుకుంది. అయితే మూర్తి యీ డబ్బువిషయం చాలారోజుల బట్టీ ఆలోచిస్తూ ఉన్నాడుగాని ఆ ఆలోచనలో జగ్గయ్య తగలటానికి వీల్లేదు. అంత మొత్తం విషయంలో జగ్గయ్య ప్రసక్తి ఉండటానికి వీల్లేదు. అందుకనే చెప్పలేదు. ఆ భారం తల్లిమీద నేపెట్టేడు. ఇంటికి వెళ్ళింతర్వాత జగ్గయ్య గొడ్లపని చేస్తున్నాడే గాని ఆలోచనంతా ఆ విషయాన్ని గురించే. ఆలోచించగా ఆలోచించగా మెఱుపుతీగలాగా ఒక ఉపాయం తట్టింది. ఒక పనిని సాధించాలని నిజమైనకోరికే కనక ఉన్నట్టయితే యేదో ఒక తరణోపాయం దొరక్కపోదు. అయితే ఆ ఉపాయాన్ని ఆచరణలో పెట్టే శక్తి కావాలి—తన భోజనం పెందరాడే ముగించుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలైంది. లోపలి యింట్లో తల్లి తండ్రికి వడ్డిస్తున్నది. మెల్లిగా పెట్టెదగ్గర కెళ్ళేడు. చల్లగా తెరిచేడు. తల్లి ఒక్కసారే కట్టుకుని మళ్ళీ మడతపెట్టి పెట్టెలో పెట్టిన చీరతీసి చొక్కా లోపలగా చంకలో పెట్టుకుని పైన తువాల కప్పుకుని యెకాయెకి ఏనాది భాగవతం దగ్గర కెళ్ళేడు. భాగవతం అయిపోయేదాకా కూర్చుని అందర్నీ యిళ్ళకి వెళ్ళనిచ్చి మెల్లిగా యేనాది భాగవతుల గుడిసెదగ్గర కెళ్ళి సరాసరి నాయకురాల్ని కలుసుకుని చీర బేరంపెట్టేడు. కనుక్కుంటే మమ్మల్ని తంతారంది. మాదీవూరు కాదులేఅన్నాడు. "అయితే ఎంతకిస్తావ్?" "పదిరూపాయలు"; రెండు రూపాయల కియ్యమంది. ఆఖరిబేరం 5 రూపాయలు చెప్పేడు. అక్ఖర్లేదంది. చాలా అవసరమన్నాడు. పాపం జాలికలిగింది కాబోలు మూడురూపాయల కియ్యమంది. వెనక్కి మళ్ళేడు. పిలిచి, నాటకానికి పుచ్చుకున్న అయిదురూపాయలూ అతని చేతిలోపెట్టి చీరతీసుకుంది. నాలుగైదుసార్లు నోటు పరామర్శించుకుని లాగూ జేబులో పెట్టుకుని యింటికి చేరేడు.

అంతా నిద్రపోతున్నారు. మంచాలమీద ఖాళీ లేదు. న్యాయమైతే ఉండాలి. అమ్మదగ్గర బుల్లి తమ్ముడుంటాడు. అయిదేళ్ళ చెల్లెల్ని నాన్న పడుకో బెట్టుకుంటాడు. ఏడేళ్ళ తమ్ముడూ తనూ ఒక మంచంమీద. కాని నాన్న ఒక్కడూ ఒక మంచం ఆక్రమించాడు. పెద్దతమ్ముడుదగ్గర చెల్లెలు పడుకుంది. నాన్నపక్కలో పడుకుంటే—'అమ్మో'. పోనీ చెల్లెల్ని యథాస్థానానికి చేరిస్తే—ఒద్దులే. ఈ పూట ఒంటరిగా పడుకోవటం మంచిది. స్వంత తమ్ముడైతే మటుకేం—ఏడేళ్ళవాడైతేమటుకేం—డబ్బువిషయంలో నమ్మరాదు. చల్లటి అరుగుమీద పడుకుని తుండుగుడ్డ కప్పుకున్నాడు. ఎందుకనో యెప్పుడూ లేంది యివాళ దొంగలొస్తారని భయంగా ఉంది. నిద్దరపట్టటం లేదు. ఎలా పడుతుంది. తన దగ్గర 'పైక' ముంది. తన జీవితంలో యింతవఱకూ తన యిష్టంవచ్చిన ఖర్చు చెయ్యటానికి హక్కున్న యింత మొత్తం ఒక్కసారిగా యెప్పుడూ తనవద్ద లేదు. ఏదో రకంగా వేలకివేలు యినప్పెట్టెలోకి చేర్చినవాళ్ళ బాధంతా పడ్డాడు. తనొచ్చి రెండుగంటలు కాలేదు తెల్లవారింది. ఏనాది వాళ్ళెగిరెగిరి నాలుగింటిదాకా ఎగురుతారు. తండ్రిలేచి చుట్ట వెలిగించుకుని మంచం క్రింద కఱ్ఱతీసుకున్నాడు. కన్ను సగం తెరిచి చూస్తున్నాడు—గుండెలు దడదడ కొట్టుకున్నయ్. లేవ్వే! తెల్లవారిందని అమ్మని చిన్న కేక వేసి పొలం వెళ్ళిపోయాడు. 'బ్రతుకుజీవుడా' అనుకున్నాడు. అయితే ఏంలాభం—అదుగో అమ్మలేస్తున్నది. మళ్లీ కొద్దిగా గుండెల్లో దడ. అయితే వెనకటంత లేదు—అహ! కాదు—ఎక్కువౌతున్నది దగ్గరకొస్తున్నది వస్తూనే 'దొంగవెధవా! ఇక్కడ పడుకున్నావా?' అంటూ చేత్తో తట్టి లేపుతున్నది. కొంపమునిగింది ఇంకేముంది—కనుక్కుంది—ఖాయమే—పైగా 'దొంగవెధవా' అని కూడా అంది. ఇంకేముంది చేసిన ప్రయత్నమంతా వృథా. అయినా ఇంత తొందరగా యెందుకు కనుక్కోవాలి. ఈ రాత్రే ఆ చీరతో అంత ముంచుకుపోయే పనేమొచ్చింది. ఆడవాళ్ళెప్పుడూ యింతే—కొత్తగుడ్డ దొరికితే చాలు

చిరిగిందాకా విడవరు. రెక్క పట్టుకు లేపుతూ 'పిచ్చి వెధవా పక్కా పాడూ లేకుండా అరుగుమీదనా? ఏం ఆ వెధవ భాగోతానికి వెళ్ళకపోతే? లే! మీ నాన్న పొలమెళ్లారు. మంచంమీద పడుకుకో' అని లేవదీస్తున్నది. అమ్మ! బ్రతికేం, చూసుకోలా యింకా —అమ్మ చాలామంచిది. మొదట్నుంచీ యింతే. నిద్దరమత్తులో ఉన్నట్టుగా యేదో గొణుక్కుని వెళ్లి మంచంమీద పడుకున్నాడు. తల్లి పనిచేసుకోవటాని కింట్లోకి వెళ్ళిపోయింది

సూర్యుడింకా పైకి సాగలేదన్నమాటే గాని బాగానే తెల్లవారింది. అయిదు నిమిషాలైంది మళ్లీ జేబులో చెయ్యిబెట్టి చూసుకున్నాడు. కాగితం తగుల్తూనే ఉంది. మెల్లిగా లేచాడు. సరాసరి మూర్తి యింటికి వెళ్ళేడు. న్యాయమైతే మూర్తే వచ్చి తన్ను కేక వేయాలి. 'ఇంత పెందరాడే వచ్చావేంగోయ్?' అన్నాడు పుస్తకం మూసి లాంతరార్పుతూ. ఇప్పుడు తన కింత చిన్న ప్రశ్నకి సమాధానం చెప్పే అవకాశం లేదు. కట్టకి వెళ్దాం రమ్మన్నాడు. బయల్దేరి వెళ్లారు. మామూలు చోటుకి వెళ్ళగానే 'ఆగుదామా' అన్నాడు మూర్తి. 'కాగులే ఇంకా పైకి పోదాంరా' అన్నాడు. మొత్తానికి అరమైలుదూరం వెళ్లిన తర్వాత ఆగేరు. చుట్టుపక్కల పారజూచాడు. ఎవ్వడూ మనిషన్న వాడు తగల్లేదు. ఒకవేళ ఉన్నప్పటికీ తను చేయబోయే పని చూసే పరిస్థితిలో ఉన్నవాడు లేడు. జేబులో నోటు తీసి 'పది దొరికినయ్యన్నావుగా! దీంతో కలిపి ఫీజు కట్టెయ్' అని మూర్తి చేతులో పెట్టేడు. 'ఎక్కడిదిరా ఇంత డబ్బ'ని ఆశ్చర్యంతో అడిగేడు మూర్తి. 'చెబుతాలే ఇవాళే ఫీజు కట్టెయ్' అన్నాడు. అతను జేబులో పెట్టుకున్నాడు. వద్దన లేదు. ఇప్పుడే కాదు ఎప్పుడూ అనలేదు. దాని కారణం వాళ్లి స్నేహం మొహమాటాల దశలో లేదు. అసలు ప్రారంభమే దాని తర్వాతనుంచీ. అయిదు రూపాయల నోటు మూర్తిచేతి కిచ్చింతర్వాత జగ్గయ్య హృదయం యెంత తేలికయిపోయిందో చెప్పలేము. శకుంతలని అత్తవారింటికి పంపిన తర్వాత కణ్వుడి హృదయస్థితినే కాళిదాసు సరిగా వర్ణించ లేకపోయాడు. ఇప్పటి జగ్గయ్య హృదయాన్ని అసలే వర్ణించలేడు. స్కూలుకి పెందరాడే వెళ్లమన్నాడు. వెళ్లగానే ఫీజు కట్టెయ్యమన్నాడు. ఊళ్ళోకి తిరిగి వెళ్ళేలోపుగా చెప్పిందే పదిసార్లు చెప్పేడు జగ్గయ్య. ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. న్యాయంగా అయితే మూర్తి యింటికి వెళ్లి కాసేపు కూర్చుని రావాలి. ఇవాళ వెళ్లదలచుకోలేదు. అతని కొక బాధ తీరినా మరో బాధ పట్టుకుంది. 'మూర్తి ఎప్పుడు స్కూలుకి వెళ్తాడా' అని. ఎప్పుడో పొద్దుననంగా తెల్లవారింది. ఇంకా తొమ్మిది కాలేదు. కాలాన్ని తిడుతూ గొడ్లకి కుడితి పోసి మొహం కడుక్కుని పాలు తీసి పొలం వెళ్లి బెండకాయలు కోసుకొచ్చి స్నానంచేసి అన్నం తిని బయట కొచ్చేసరికి బుజంమీద సంచీ వేసుకుని ఒక చేత్తో టిఫిన్ పట్టుకుని మూర్తి బడికి వెళ్తున్నాడు. ఎంత ఆనందపడ్డాడో చెప్పలేం. తనే అతన్ని చదివిస్తున్నంతగా అనుకున్నాడు. మళ్ళీ నిమిషం కాలేదు. గుండెల్లో రాయి పడ్డట్టయింది. ఈ యేనాది వాళ్ళివ్వూరునుంచీ పోరేం. ఇప్పటికి నాలుగు నాటకాలాడేరు. చాలదూ? ఆశ—వెధవ ఆశ, మితం ఉండఖ్ఖర్లా లోపల్లోపల వాళ్ళని తిట్టుకుంటూ యింటికివచ్చి గొడ్లని విప్పుకుని పొలం వెళ్ళి పోయాడు.

ఆరోజు గడిచిపోయింది. నుర్నాడు సాయంత్ర మైంది వాడుకకి ఉన్నవే రెండు చీరెలు. ఒకటి ఒంటికి, రెండోది చాకలింటికి. ప్రొద్దున వేసిన చీరె చాకల్ది తేలేదు, గేదె తొక్కిందని. వారంరోజుల క్రితం ఇట్లానే చేస్తే కొత్త చీరె గడివిప్పి కట్టుకుంది. విడిచింది అప్పటికప్పుడు ఉదికి ఆరవేసి తెల్లవార గానే కట్టుకుని మళ్ళీ కొత్తచీరె మడతపెట్టి పెట్లో పెట్టింది. ఆ రాత్రి కొంచెం జాగ్రత్తగా కూడా పడు కుంది. ఈపూట మళ్ళీ చీరె రాలేదు. ఏంజేస్తుంది. పెట్టితీసింది—పోనీ విడిచిందే కట్టుకుందామా అంటే పసిపిల్లవాడు తడిపేడు. పైగా విడిచి నేలమీద పారేసి స్నానంచేసింది. ఎలా కట్టుకుంటుంది. ఒంటి మీద మొగుడి ఉత్తరీయం ఉంది సరే పెట్టెతీసింది. ఒక్కసారి గుండెలో టక్కుమంది. ఒక్కొక్కటే పిల్లల గుడ్డలన్నీ తీసి క్రిందపడేసి వెదికింది. గుండె కొట్టుకులాడింది. ఇల్లంతా గాలించింది. పిల్లలు కాళ్ల కడ్డంపడుతున్నారు. రెండోకొడుకు 'నాటకాని కెళ్దామే'అమ్మాఅని గోలచేస్తున్నాడు. ఎడా పెడా బాదింది. ఎంత వెదికినా కనిపించలేదు. ఇదేమిటి యింత చిత్రంగా మాయమైపోయిందనుకుంది. తన చేత్తో మడతపెట్టి పెట్లో పైనే పెట్టింది. బాగా గుర్తు. మళ్లీ వెతికింది. వెతికినచోటే నాలుగైదుసార్లు వెతి కింది. ఏంలాభం లేకపోయింది. ఏమనుకోవటానికీ పాలుపోలేదు. జగ్గయ్యవచ్చి 'ఇవుగోమ్మా పాలు' అన్నాడు. 'రోగమా పెట్లో పెట్టలేవూ! అందు కోవాలేం' అని నాలుగు ఝాడించింది. అమ్మ కింత కోపం యెందుకువచ్చిందో తెలియలేదు. చెంబు పెట్లో పెట్టి బైటికి వెళ్లిపోతాడు. ఇంకా యేం జేస్తుంది విడిచిన చీరె మళ్లీ కట్టుకుంది. అయితే పట్టు కున్న బాధ కొత్తచీరె సంగతి. రెండు నెలల నెయ్యి అమ్మి కొనుక్కున్నది. మతిపోయినట్టుంది ఒకపని చెయ్యబోయి మరొకపని చేస్తున్నది. ప్రాతసామాన్లు పగిలిపోతున్నయ్. మొగుడొచ్చాడు. విషయం తెలిస్తే తన్నే తిడతాడు తన తెలివి తక్కువకి; మెదలకుండా ఊరుకుంది.

భోజనాలయినయ్. రెండోవాడు సాయంత్రం నుంచీ చంపుతున్నాడు నాటకానికెళ్దామని. మొన్నకూడా యిలాగే వెళ్దామని గోలచేస్తే వెళ్దాంలే అని మాయమాటలు చెప్పి నిద్రబోయేటట్టు చేసింది. అందుకనే వాడివాళ జాగ్రత్తగా ఉన్నాడు. అసలు మంచంమీద కూర్చోవటమే లేదు ఎక్కడ నిద్రవస్తుందోనని. 'పోనీ తీసికెళ్ళవే' అన్నాడు మొగుడు. మధ్యాహ్నం పక్కింటి ఆవిడతో గూడా ఆ విషయమొచ్చి వెళ్దాంలెండి అంది. అప్పట్నుంచే పట్టుకున్నాడు పిల్లవాడు. ఆడవాళ్ళకి పదిమంది ఆడవాళ్ళతో కలిసి కబుర్లు చెప్పుకోవటమంటే సరదా. కబుర్లు చెప్పుకోవటంలో మొగవాళ్ళకంటె ఆడవాళ్ళదే పైచేయి. అందుకనే ఊళ్ళో యేదైనా పేరంటం అంటూ జరిగితే యికాపూటకి మొగవాళ్ళకి తిండి ఉండదు. పైగా యీపూట ఒక పెద్దవిషయాన్ని గురించి అమ్మలక్కలతో ప్రస్తావించవచ్చు. అది చీరెసంగతి; మనసులో బాధ పదిమందితో చెప్పుకుంటే తగ్గుతుంది. చీరె—దాని గట్టితనం—అంచు మెఱుపూ—ఎలా, ఎక్కడ, ఎంతకి కొనబడింది—దాని మహాత్మ్యం మొదలైన విషయాలన్నీ చర్చించవచ్చు. కాబట్టి నిశ్చయంచేసుకుని 'వెళ్దాంలేరా అంది' కొడుకుతో. ప్రక్కనే పడుకుని ఉన్నాడు జగ్గయ్య. గుండెలు దడదడ కొట్టుకున్నయ్ ఆమాట వినేసరికి. 'ఏన్నాటకం వెధవ నాటకం యేడ్చినట్టు వేస్తారు. అంతకంటె హాయిగా నిద్రపోవటం మంచిద'న్నాడు. 'ఎందుకుబాగుండదేం! బాగానే ఉంటుంది వెళ్దామే అమ్మా' అన్నాడు తమ్ముడు. 'నోరుమూసుకు పడుకో' అన్నాడు తమ్ముణ్ణి. 'మొన్న నువ్వెందుకు వెళ్ళవోయ్ వెధవయ్యా?' అన్నాడు తండ్రి. 'బాగుంటుందని వెళ్ళేను. ఏడ్చినట్టుంది. ఒక్కడానికీ సరిగా గొంతులేదు. బఱ్ఱి గొంతులు. ఏమీ బాగుళ్ళేదు. నే నివాళ్ళ రాను' అన్నాడు ఎవరో మహా తన్ను రమ్మని బ్రతిమాలినట్టుగా. పక్కింటావిడ కేకవేసింది. 'పదరా' అంటూ బయల్దేరి వెళ్ళేరు. జగ్గయ్యకి తల గిఱ్ఱున తిరుగుతున్నది. మంచంమీద ఊరికే అటూ ఇటూ దొర్లుతున్నాడు తాపం పుట్టినవాడల్లే.

దేవుడి గుడిముందు పెద్ద ఖాళీస్థలం. రెండు బొంగులు పాతి అడ్డంగా ఒక గడకట్టి రెండుప్రక్కలా రెండు 'పెట్రోమాక్స్' లైట్లు కట్టారు. కొద్దిగా వెనకాల ఒక తెర. దాని వెనకాలే గ్రీన్‌రూమ్. అక్కడే ఆర్కెస్ట్రా, అంటే పాత హార్మోనీ ఓటిమద్దెలా. తెర యెత్తటం దింపటం ఉండదు. పని ఉన్నప్పుడు పాత్ర తెరముందుకు రావటం పనిచూసుకుని మళ్ళీ తెరవెనక్కి వెళ్ళిపోవటం. అంతా సిద్ధమయింది. 'రావాలి రావలంటూ కేకలేస్తున్నారు జనం. నాటకం అంటే భాగోతం, ఆడించే ఆసామీ 'మొదలెట్టండోయ్' అనేసరికి 'చిత్తం సామీ' అంటూ రాజరాజనరేంద్రుడి వేషంలో ఉన్న ఏనాది సుబ్బాయి రంగంమీదకి వచ్చాడు. వాడేదో తన ఘోషంతా చెప్పుకుని వేటకి వెళ్తానంటూ వెళ్ళిపోయాడు. వెంటనే రెండో కోర్టు. ఇప్పటి నాటకాలకిమల్లే రంగరంగానికీ మధ్య గంటల తరబడి ఆలస్యం ఉండదు. ఒక రంగమయిపోవటమాలస్యం. రెండో రంగంలో పాత్రలు సిద్ధంగా ఉంటారు. ప్రవేశించింది చిత్రాంగిగా నాయకురాలు ఏనాది 'చుక్కాం'. తెల్లటి చీర కట్టుకుని. 'అమ్మయ్య' అనుకున్నాడు అందరికీ చివర నుంచునిఉన్న జగ్గయ్య. గబగబ ముందువాళ్ళందర్నీ తప్పించుకుని వెళ్ళి లైట్ల గడకర్రలకి కట్టిన తాళ్లు పట్టుకుని కూర్చున్నాడు. ప్రేక్షకులంతా ముందుకు తోసుకుంటూన్నారు. ఈల లేస్తున్నారు. ముందు కూర్చున్న రసికుల్లో ఒకడు మల్లెపూలు చల్లేడు నాయకురాలిమీద. సుబ్బాయికి—పొరపాటు—రాజరాజనరేంద్రుడికి కోపం వచ్చింది. చిత్రాంగి కొద్దిగా కోపం నటించింది. కాసేపు యిద్దరూ ఎగురులాడుతూ పాడి లోపలికి వెళ్ళిపోయారు. మూడో రంగం. 'రాజా సారంగధరుడూ నెడాలే పారావతములాడా ॥రాజా॥' అని పాడుకుంటూ ఇందాకటి రాజరాజే వచ్చాడు. అయితే చొక్కా మారింది.

సారంగధరుడు స్నేహితుల్తో పావురా ల్నెగర వేస్తున్నాడు. ఏ మెగిరి చస్తయ్. దారాల్తో లక్షణంగా రెక్కలు కట్టేశారు. విసిరితే గుడ్డమూటలల్లే నేలమీద పడుతున్నాయ్. 'చంపేవురా నీ యమ్మ కడుపుకాలా' అని కేక పెట్టేడు చాకలి వీరాయి. అవి వాడివి. వాడిదగ్గర ఉన్నయ్ కాబట్టే ఆ నాటకం ఆడటం జరుగుతున్నది. అవి లేని వూళ్ళో ఆ నాటకం ఆడరు. కాసేపాడి సారంగధరుడు వెళ్ళిపోయాడు. జనం చప్పట్లు కొట్టేరు. అందరూ ఆపిన తర్వాత కూడా కాసేపు కొట్టేడు జగ్గయ్య. పాపం బలే సరదా. ఎంతో ఆనందంతో రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు.

నాలుగో రంగం. చిత్రాంగీ సారంగధరులది. అసలు నాటకాని కాయువుపట్టే అది. జనంలో మళ్ళీ తొక్కిడి ప్రారంభమైంది యెవరికివారే ముందు కూర్చోవాలని. అందరితోపాటు జగ్గయ్య కూడా అరిచాడు 'తొందరగా రావాల'ని. ఇందాక మల్లెపూలు చల్లిన పెద్దమనిషికి మరీ ఆరాటంగాఉంది. ఈ రసికుణ్ణి మనసులో పెట్టుకునే చిత్రాంగి ఆలస్యం చేస్తున్నది.

అతన్ని ఇంకొంచెం రెచ్చగొట్టాలి. అర్ధరూపాయన్నా దొరకదా! ఇందాకటికంటె యెక్కువ

అందంగా కనబడాలి. ఏం చెయ్యటం. బాగా ఆలోచించింది. మరి కొంత పౌడరు మొహానికి కొట్టుకుని పెట్టె తీసి మరో చీర కట్టుకుంది. వేషమంతా నాలుగైదుసార్లు సర్దుకుని ఆంజనేయస్వామి పట మొకటి పట్టుకుని 'మానసహారా! సారంగధర! కన్నులార నిను కాంచెడి భాగ్య మదెన్నడో' అని పాడుకుంటూ ఒయ్యారంగా కులుకుతూ షోకు షోగ్గా ప్రవేశిస్తున్నది. జనం గుమ్మయిపోతున్నారు. ఈలలతో నోళ్లూ వేళ్ళూ కూడా నెప్పిపుడుతున్నయ్...... జగ్గయ్య గుండెలు పగిల్నయ్. చెమటలు పోసినయ్. బిత్తరపోయి చూస్తున్నాడు. నెత్తిన పిడుగు పడ్డట్టయింది. మొదట కట్టుకున్న చీరె చూడగానే 'అమ్మయ్య' అనుకున్నాడు. మళ్ళీ ఇదేమిటి తెలివితక్కువ ముండ ఈ చీర కట్టుకుంది. దీని మొహం తగలబడా. దీని అవతారానికి తోడు కోర్టుకోర్టుకీ చీర మార్చాలా! మొన్న ఉషాపరిణయం నాటకమంతా ఒక్క చీరెతోనే ఆడిందే. ఇవాళ్ళికేం రోగం, మార్చి చచ్చింది!' అని లోలోపల నానా తిట్లూ తిడుతున్నాడు. కాని యేం లాభం. దాని గొడవలో అది ఉంది. 'చీరె అమ్మేటప్పుడే యీ వూళ్ళో ఉండగా కట్టుకోవద్దని చెప్పకపోవటం పొరపాటనుకున్నాడు. అల్లా చెబితే యీవూరివాడే ననుకుని యెవరితోనన్నా చెబుతుం దేమో నని లేదా అసలు కొననేకొనదేమో నని పొరుగూరివాణ్ణని చెప్పేడు. అదే కొంపముంచింది. పొరుగూరి చీరెగదా అన్న ధైర్యంతోనే అదీ కట్టుకుంది. ఒకవేళ కనుక్కుంటే మటుకు అంత మునిగేదేమిటి దానికి. గౌరవంగా బ్రతకదల్చుకున్నవాడెవడూ కట్టింది విప్పించి కెళ్ళడుగా!

ఆడవాళ్ళల్లో యేదో కలవరం బయలుదేరింది. మరేం లేదు వాళ్ళనీ వీళ్ళనీ తొక్కుకుంటూ జగ్గయ్య తల్లి హడావుడిగా పోతున్నది. రెండంగల్లో యింటికి చేరింది యిల్లాలు. 'ఎన్నేళ్లొస్తే యేం సిగ్గూ బిడియం లేకపోయినతర్వాత. కల్లోకూడా అనుకోలేదు ఇట్లా చేస్తాడని. ఛీ ఛీ! ఏమైనా నానమ్మటానికి వీలుందా మనుషుల్ని? నలుగురుబిడ్డలతండ్రే! ఎండ్రకాయలుపట్టుకునే యీనాదిదాని పాలుబడతాడా? ఏగాని ముండకి పన్నెండు రూపాయలచీరె కట్టబెడతాడా సిగ్గేమయినా ఉందా! ఎంతపని' అనుకుంటూ గబగబా యింటికిపోయి మొగుణ్ణి లేపింది. కళవళపడి లేచాడు. 'ఏమిటు'న్నాడు. 'ఇంకా యేమిటంటున్నారు యేమీ ఎఱుగనట్టు ఛీఛీ' అంటూ తన మంచంమీదకి వెళ్ళిపోయి కూర్చుంది అటుదిరిగి. 'ఏమిటే నువ్వనేది?' అని గట్టిగా అడిగేడు. 'ఇంకా యేమనాలి మన ప్రయోజకత్వానికి యెన్నేళ్ళొస్తేయేం.' 'ఇదేమిటి! అర్ధరాత్రి పూట యీ గొడవేమిటి ఉప్పెనలే' పాపం యేమీ అర్థంగాక 'అసలు సంగతేమిటే' అన్నాడు తీవ్రంగా. 'ఇంకేం సంగతి కావాలి నా బతుకిట్టా బండలైపోయిం తర్వాత? ఏగానీ ఖరీదు చెయ్యని యీనాదిదాని మాత్రం కాక పోయాను. నా కింతపని జేస్తున్నదికాక నా ఛీర పట్టుకెళ్ళి యియ్యాల్లా! ఆ చీరె అది కట్టుకుంటేనే యెక్కువ బాగుంది కాబోలు.' కొద్దిగా ఊహగా అర్థమైంది అలవాటువల్ల 'నోర్ముయ్! నీ చీరేమిటి నేను యీనాద్దాని కియ్యటమేమిటి నీకేమన్నా పిచ్చెక్కిందా!' అని అరిచాడు. చీర పోవటం అలా ఉంచి అసలు బాధ అవమానం, ద్రోహం. ఏ దోషాన్నైనా సహిస్తుందిగాని ఆడది పురుషుడిలో యీ దోషాన్ని సహించలేదు. పురుషులైనా అంతే అనుకోండి. కాని స్త్రీ విషయంలో యెక్కువ. 'నోరు మూసుకునే ఉన్నాను. అంతకంటే యేం జేస్తాను. నేనేమన్నా అడ్డమొచ్చానా మీ యిష్టమొచ్చినట్టు ప్రవర్తించుకోవచ్చు. నా చీరె పట్టుకెళ్ళి యివ్వటం దేనికా అన్న యేడుపుదప్ప—' ఏడుపు పెద్దదైంది. కన్నీళ్ళు వస్తుస్థితిలో చాలా తేలికైనవే కాని ఆడదాని ఆయుధం. తేలికదైనకొద్దీ పురుషుడిమీద వాటి ప్రభావం యెక్కువౌతుంది. స్త్రీ బలహీనతే పురుషుడిమీద వజ్రాయుధం. ఎక్కిళ్ళమూలాన ముక్కలు ముక్కలుగా తెగుతున్న యేడుపువిని దగ్గరికిచేరాడు. 'నేనే మెఱుగుదునే నీ చీరె! ఎనాద్దాని కివ్వటమేమిటే! ఎవరన్నా చెప్పేరా? నువ్వే అంటున్నావా? అసలు సంగతేమిటి?' అని మెల్లిగా అడిగేడు. 'ఎరక్కపోతే ఎగిరిపోయిందా పెట్టెలో చీరె యెకాయెకి యీనాద్దాని దగ్గరికి! నా కళ్ళతో నేను చూస్తే చాలదూ ఎవరు చెప్పాలి? వెళ్ళి చూ!స్తే తెలుస్తుంది. అంతా అదే చీరె. అంచూ అదే. నాది కాకపోతే పెట్టెలో పెట్టిన చీరె యేమయిపోతుంది?'... ఇప్పుడు విశదంగా అర్థమైంది. పెళ్ళాం చీరె పోయినట్టూ అది యీనాదిది కట్టుకున్నట్టూ. ఎట్లా పోయింది?... ఒక్కటేమార్గం. పళ్లు పటపట కొరికాడు. నిల్చున్నవాడు నిల్చున్నట్టె బయల్దేరేడు. సరాసరి భాగోతందగ్గర కెళ్ళాడు. పదినిమిషా లూరుకున్నాడు. ఆ రంగం అయిపోయింది. 'జగ్గాయ్'అని పొలికేక వేశాడు. విన్నాడు; పిడుగు పడ్డట్టయింది. తెలిసినట్టేఉంది. ఏంచెయ్యటం? మెల్లిగా యెటన్నా పారిపోదామంటే లేస్తేనే చూస్తాడు. అందుకనే మెదలకుండా కూర్చున్నాడు. మళ్లీ పెద్దపులి కేక. లాభం లేదు. వదిలేటట్టు లేడు. 'ఇదుగో ఇక్కడే ఉన్నానండీ' అని అరిచాడు—అతను లేచి వెళ్లితే ఆ చోటులో కూర్చుందామని ఒక కుర్రాడు. 'రావేం రా....' అనేటప్పటికి పిల్లిలాగా లేచి అడుగులో

అడుగు వేసుకుంటూ మెల్లిగా జనాన్ని దాటి బయట పడ్డాడు. 'రా యింటికంటూ' కొద్దిదూరం పోయిన తర్వాత మెడ బట్టుకుని 'దరిద్రపు................' అని లాగి కొట్టేడు చెంపమీద. తల దిమ్మెక్కింది. కొట్టుకుంటూ కొట్టుకుంటూ వస్తున్నాడు. వెళ్ళొచ్చి తనకేం సమాధానం చెబుతారో చూద్దామని వాకిట్లో నిలబడివుంది యిల్లాలు. ఛెడేలు ఛెడేల్ మని దెబ్బలు వినిపిస్తున్నయ్. ఎవర్ని కొట్టటం!...ఎవరేమిటి కొడుకునే ఎందుకూ...'అయ్యొయ్యొ కొట్టకండి కొట్టకండి' అంటూ కేక పెట్టింది. 'కొట్టాలా కోయ్యాలా అప్రదిష్టపు..........' అంటూ మరి రెండుకొట్టి తీసుకొచ్చాడు. అలవాటు లేని దెబ్బలు భరించలేక 'అమ్మా!' అని కేక వేశాడు. 'అయ్యొయ్యొ చచ్చిపోతాడండీ' అంటూ పరిగెత్తికెళ్ళి పిల్లవాణ్ణి లాక్కుంది. 'చావనీ—చస్తేయేం ఇటువంటి దౌర్భాగ్యుడు' అని వదలకుండానే లోపలికి తీసుకొచ్చాడు. 'నిజం చెప్పు! ఇచ్చావా లేదా చీర యానాద్దానికి....మాట్టాడవేం...! చెప్పు! ని ప్రాణం తీస్తానీవాళ....నిన్నొదల్ను....చెప్పవేం ఇచ్చావా లేదా' అని మెడవంచి రెండుగుద్దులు గుద్దేడు. 'అయ్యొయ్యొ అయ్యొయ్యొ! చచ్చిపోతాడండీ వాడే చెబుతాడు వదలండి' అని యివతలికి లాగుతున్నది 'నువ్వూర్కో! ఇవాళ్టి పని జేశాడు రేపు మరోటి జేస్తాడు. ఇంతదూర మొచ్చావా త్రాష్టపు.......చెప్పవేం. ఇచ్చావా లేదా' దెబ్బలు భరించలేకపోతున్నాడు "ఇచ్చాను."

అపర్ని జుట్టుపట్టుకుని వంగదీసి 'ఇంతదూర మొచ్చావా ఇంతదూర మొచ్చావా' అని గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు. 'అయ్యొయ్యొ అయ్యొయ్యొ' అని యెంత అడ్డమొచ్చినా వినిపించుకోకుండా అలుపొచ్చిందాకా కొట్టేడు. ఇక కొట్టలేక 'చావు' అని ఒక్క తన్ను తన్నేడు. రెండుగజాల దూరంలో పడ్డాడు. 'అమ్మొ నాబిడ్డ!' అంటూ పరుగెత్తికెళ్ళి లేవదీసి చెవులుమూసి కావిలించుకుంది. నిలబడలేక రొప్పుతున్నాడు. తీసుకొచ్చి అరుగుమీద కూర్చొబెట్టింది. 'ఎంత యిదైతేమటు కంత ఒళ్ళూ పై దెలియకుండా కొడతారా! పోతేపోయింగి వెధవచీర! అంతూ పొంతూ ఉండఖర్లా ఆ కొట్టటానికి?'

'కొట్టాలా కోయ్యాలా అప్రతిష్టపు వెధవ నా కడుపు చెడబుట్టేడు."

ఇట్లా కొడతాడని తెలిస్తే చెప్పేదిగాదు. అసలు విషయమిదని యేమాత్రం తెలిసినా చెప్పేదే గాదు. 'తెలివితక్కువ చచ్చిందాన్ని ముందుగా వీణ్ణే అడిగేను కాను' అని తిట్టుకుంది 'ఇస్తే ఇచ్చాడు. ఏం ఇస్తే? ఎంతమంది చెయ్యటంలా ఇట్లాంటి పనులు. రేపో యెల్లుండో చావబోయే ముసలాళ్ళే చేస్తున్నారు ఇట్లాంటి పనులు. చిన్నబిడ్డ వాడికేం తెలుసు. పొరపాటున తప్పుచేస్తే మెల్లిగా చెప్పుకోవాలి. అంతేగాని చావగొడతారా? అసలు బుద్ధి తక్కువైంది చెప్పటం'. అని యీ రకమైన ఆలోచన లెన్నో ఆ మాతృహృదయంలో పరుగెత్తినయ్. ఎక్కిళ్ళొస్తున్నయ్. మంచినీళ్ళు తాగించి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

'దరిద్రుడు—వీడి జన్మ తగలెయ్య. అని యింకా తెరలు తెరలుగా తిడుతూనే ఉన్నాడు.

'కడుపుంగో కాళ్ళు కడుపులో ఉండగానే పుడుతున్నయ్ పోయేకాలపు బుద్ధులు. సరిగ్గా కళ్ళు తెరవలేదు; వీడికి లోడు వీడు ముష్ఠయేళ్ళ ముండకి పట్టుకెళ్ళి చీర ఇస్తాడా?'

'అబ్బ! పోనిద్దురూ! అయిపోయిందాని కొకటే గోల.'

'ఏం పోనియ్యటం! సరిగ్గా బతికేవాండేనా వీడు."

'పోనిద్దురూ ఎట్లాగొట్లా బతుకుతాడు."

తల్లీ తండ్రీ ఇద్దరూ తనమీద అపవాదం వేశారు. జరిగిందొకటి వీళ్లనుకునేదొకటి. అయితే ఈ అపవాదమే మేలైంది. అసలు విషయం తెలిస్తే మూర్తికూడా ముద్దాయి అవుతాడీ కేసులో. అమ్మో అదెంతమాత్రం జరగకూడదు. కూడదు. ఇదే బాగుంది. కేసు ఈరకంగా మారటానికి దారి చూపించినవాడు తండ్రే......దెబ్బలు తగిలిన చోట్లు మంచానికి ఒత్తుకున్నా ఇంకా నెప్పెడుతూనే ఉన్నయ్. అయితే కళ్ళకి కనబడుతున్నాడు మూర్తి నవ్వుతూ స్కూల్లో రైటరుకు డబ్బిస్తూ. తన పెదిములమీదకూడా చిరునవ్వు. ఒక మూర్తిని ఇష్టమైనదానిని చూసినప్పుడా మూర్తి హావభావాలే ఈ చూసే వ్యక్తికీ కలుగుతయ్. అదే సానుభూతి. పాశ్చాత్యుల ప్రకారం 'సానుభూతి' అనేకంటే ప్రాచ్యుల ప్రకారం 'తాదాత్మ్యం' అంటం ఉచితం. అదే కళలోని పరమసిద్ధాంతం. అందుకనే నవ్వుతున్న మూర్తినిజూసి నవ్వుతున్నాడు జగ్గయ్య.

"చిన్నవాణ్ణి ఒక్కణ్ణే ఒదిలిపెట్టి వచ్చావా? వాణ్ణికూడా తీసుకురాకపోయా?"

"రానని పక్కింటావిడ దగ్గర కూర్చున్నాడు"

* * * *

"తెప్పించమంటావా అది?"

"ఇంకేం తెప్పిస్తారు మెదలకుండా ఊరుకోండి"

తెప్పించరు. అదేగ మస్తు. తమ ఇష్టమొచ్చినట్టు చావగొడతారు. లేనిపోని అనుమానాలెన్నెన్నో పడతారు. అంతే—పైవాళ్ళు పడటానికి ఒప్పుకోరు. వేలెత్తి చూపటానికి వీల్లేదు. అందుకనే గప్‌చిప్!